
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | సోమవారం 17 మార్చి 2025 | పేజీలు : 4 | వెల : 3/-


### ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే

# తమ లక్ష్యం



- కేబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనేనా..
- మంత్రివర్గం నుండి మంత్రులను తొలగిస్తేనే పాలనపై పట్టు ఉన్నట్లా?: రేవంత్ రెడ్డి
- అధికారులను తొలగించి.. బదిలీలు చేస్తేనే.. పరిపాలనపై పట్టు సాధించినట్లా
- ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారని.. కేబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారులను తొలగించి.. బదిలీలు చేస్తేనే.. పరిపాలనపై పట్టు సాధించినట్లా అని ప్రతిపక్షాలను ఆయన నిలదీశారు. అన్నింటిని సరిదిద్దుకుంటూ వెళ్లడమే తన విధానమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని ఆయన కుండ బద్దలు కొట్టారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. -

మిగతా3లో

### ప్రతి కుటుంబానికి

# ఇళ్లు



**2029 కల్లా హామీలు నెరవేరుస్తాం**

**ఒకప్పుడు అనంతపురం కరువు జిల్లా.. ఇప్పుడు 26 జిల్లాల్లో 5వ స్థానం**

**త్రిభాషా సూత్రంపై రాద్ధాంతం వద్దు.. పతి నియోజవర్గానికీ విజన్ డాక్యుమెంట్**

**పైలట్ ప్రాజెక్టుగా కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలు**

**శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్**

**(అంకుశం, అమరావతి, మార్చి 17):**

ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి కుటుంబానికి ఇళ్లు, పారిశుధ్య సౌకర్యం, నీటి సరఫరా, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, డిజిటల్ కనెక్టవిటీ, ఎలక్ట్రిసిటీ, సోలార్ రూఫ్ టాప్, రహదారుల అనుసంధానం, డ్రైనేజీ నెట్వర్క్, వేస్ట్ టు వెల్త్, స్ట్రీట్ లైటింగ్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తాం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్%-%2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల%-%2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. స్వర్ణాంధ్ర విజన్ %-% 2047 సాధనలో భాగంగా

- మిగతా2లో

## భూ వివాదాలకు అప్పిలేట్ అధారిటిగా ఆర్డీవో

### చట్ట సవరణ బిల్లుకు మండలిలో ఆమోదం



**(అంకుశం, అమరావతి, మార్చి 17):**

ఆంధ్రప్రదేశ్ భూమి, పట్టాదార్ పాస్ బుక్స్ చట్టం, 1971 సవరణ బిల్లుకు సోమవారం శాసనమండలిలో ఆమోదం పొందింది. గురువారమే శాసనసభలో సవరణ బిల్లుకు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం శాసనమండలిలో ఆమోదం కోసం బిల్లును ప్రవేశపెట్టారు. గతంలోనూ అప్పిలేట్ అధారిటిగా ఆర్డీవోనే ఉండగా 2022లో చట్ట సవరణ చేసి డీఆర్వోను నియమించారు. అయితే డీఆర్వోలకు పనిభారం అధికంగా ఉండడంతో అప్పీళ్ల పరిష్కారం ఆలస్యమౌతుండటంతో ఇప్పటి వరకు 4 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పీళ్ల పరిష్కారానికి డీఆర్వోలకు ఆరు నెలల సమయం ఉండగా ఇక నుంచి ఆర్డీవోలు

- మిగతా2లో

## స్కామ్‌లపై చర్చిద్దామంటే పారిపోయిన టీడీపీ

**గత ప్రభుత్వ స్కాంలపైనే చర్చ జరగాలని టీడీపీ పట్టుబట్టింది**

**టీడీపీ హయాంలో జరిగిన స్కామ్‌లపై చర్చకు ప్రభుత్వం నిరాకరణ**


**మీడియా పాయింట్‌లో మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ**



**(అంకుశం, అమరావతి, మార్చి 17):**

వైయస్ఆర్‌సీపీ పాలనపై బురదచల్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అసెంబ్లీ బయట మీడియా పాయింట్‌లో వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన స్కాంలపై చర్చించాలంటూ అధికారపక్షం పట్టుబట్టడం వెనుక కుట్ర దాగి ఉందని అన్నారు. అసలు విచారణే జరగకుండా కేవలం ఆరోపణలను స్కామ్‌లుగా చిత్రీకరించి వైయస్ఆర్‌సీపీ పాలనపై విషం చిమ్మేందుకు ప్రయత్నించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేనిది ఉన్నట్లుగా... ఉన్నది లేనట్లుగా చిత్రీకరించడం

- మిగతా2లో



## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం

**సోమవారం, మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనం**

**బుధవారం, గురువారం రూ. 300 ప్రత్యేక దర్శనం**

**సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టీటీడీ నిర్ణయం**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. ఈ మేరకు టీటీడీ అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై సోమవారం, మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆదివారం, సోమవారం మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపారు. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే) లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఆయా రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ

- మిగతా3లో

## రాష్ట్రపతి భవన్‌లో ఎంపీలకు విందు

### హాజరైన రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు

**(అంకుశం, న్యూ ఢిల్లీ, మార్చి 17):**

ఢిల్లీ రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఎంపీలకు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా,

- మిగతా2లో



# ప్రతి కుటుంబానికి ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాటిని అమలు చేసి నియోజకవర్గ అభివద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ముందు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసినట్టు చెప్పారు. నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్‌ను సఫలీకతం చేసుకునేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తున్నామని, దీనికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. మండల, మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్‌ను గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా తీసుకుని అమలయ్యేలా చూస్తామన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ రూపొందించి కలెక్టర్ల సదుస్సులో విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రతి చివరి వ్యక్తిని కూడా విజన్‌లో భాగస్వామిని చేస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ప్రస్తుతం నెలకొన్న సమస్యలు ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలాగా పరిశ్రమలు తరిమేయడం కాకుండా... తీసుకురావడం నేర్చుకోవాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలు తేవడంలో మీరు కూడా భాగములు అవ్వాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండాలి...అలానే ఉపాధి కలగాలంటే పరిశ్రమలు రావాలి... సేవల రంగం వద్ధితో ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఒకప్పుడు అనంతపురం కరవు జిల్లా. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు అనంతపురం, మహబూబ్ నగర్ జిల్లాలు సవాల్‌గా ఉండేవి. కష్ణానది పక్కనున్న మహబూబ్ నగర్‌కు నీళ్లుండేవి కాదు. ఆ రెండు జిల్లాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవాన్ని. విజయవాడ, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాలకు నీళ్లున్నా అభివద్ధిలేదు. కానీ ఇప్పుడు అనంతపురం జిల్లా 26 జిల్లాల్లో 5వ స్థానంలో ఉంది. మొదటి స్థానానికి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర%-%2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఏటా 15 శాతం వద్ధి రేటు లక్ష్యాంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రాష్ట్రాన్ని రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా ప్రభుత్వ ఆశయం. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తాం. ఇంగ్లీష్ మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ భాష కేవలం కమ్యునికేషన్‌కు మాత్రమే. మాతభాషలో చదువుకున్న వారే ప్రపంచ వ్యాప్తంగా రాణించారు. భాష అనేది ద్వేషించడంలో అర్థం లేదు. మాతభాష తెలుగు, హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళ్తున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

**స్వర్ణాంధ్రకు పది సూత్రాలు..**

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారానికి 10 సూత్రాలు... స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు.

పేదరికం లేని సమాజం, ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్యం%-%మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఫార్మర్ అగ్రిటెక్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతానికి నివేదికను యథాతథంగా ఆమోదిద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పుపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వైఎస్ఆర్ కడపగా జిల్లా పేరు మార్చాలని నిర్ణయించింది. సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్ఆర్ జిల్లాకు కడప పేరు కలుపుతూ కెబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇకపై వైఎస్ఆర్ జిల్లాను వైఎస్ఆర్ కడప జిల్లాగా పరిగణించనున్నారు. గతంలో వైఎస్ఆర్ కడప జిల్లా పేరు ఉండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం జిల్లా పేరులోని కడప తొలగించింది. దీంతో నాటి నుంచి వైఎస్ఆర్ జిల్లాగా వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పని చేశారు. అయితే రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2009,సెప్టెంబర్ 2వ తేదీన హెలికాప్టరు దుర్ఘటనలో ఆయన మరణించారు. ఈ నేపథ్యంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం.. వైఎస్ రాజశేఖరరెడ్డి సొంత జిల్లా అయిన కడప జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధినేత, వైఎస్ఆర్ తనయుడు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చారు. దీంతో ప్రభుత్వం చేపట్టిన పథకాలకే కాదు.. పలు సంస్థలకు సైతం వైఎస్ఆర్ పేరు పెట్టారు. ఆ క్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా పేరును మార్చారు. అందులోని కడపను తీసి వేశారు. దీంతో వైఎస్ఆర్ జిల్లాగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం సోమవారం జరిగిన కేబినెట్‌లో వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. బ్రిటిష్ కాలం నాటి నుంచి కడప జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. ఎన్నో శతాబ్దాల పాటు కడప జిల్లా పేరు మనుగడలో ఉంది. అలాంటి పేరును తొలగించి.. కేవలం వైఎస్ఆర్ పేరు మాత్రమే ఉండడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి వేళ.. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.


చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం లభించింది. నంబూరులో వీవీఐటీయూ విద్యాసంస్థకు ప్రైవేట్ వర్సిటీ హోదా కల్పిస్తూ ఆమోదం తెలిపింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. పలు సంస్థలకు భూకేటాయింపులకు కూడా నేటి కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది.

అటు, ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా సమర్పించిన నివేదికకు కూడా కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రాన్ని యూనిట్ గా వర్గీకరణ చేయాలని నివేదిక కమిషన్ ఇవ్వగా, జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేయాలన్న ఎమ్మెల్యేల ప్రతిపాదనపైనా కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోవాలని నిర్ణయించారు. 2026 జనాభా లెక్కలు వచ్చాక జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి జాతీయ ఎస్సీ కమిషన్ కు పంపాలని నిర్ణయించారు. బుడగజంగాలు, మరో కులాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు తీర్మానం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చుతూ నేటి కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. పెనమలూరులోని తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు.

# అమరావతికి రీ లాంచ్

-మొదటిపేజీ తరువాయి

పనుల్ని రీలాంఛ్ చేయబోతోంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పనుల్ని అట్టహాసంగా మొదలు పెట్టబోతోంది చంద్రబాబు ప్రభుత్వం. ఆంధ్రుల ఆశల్ని సజీవంగా ఉంచుతూ సరికొత్త రాజధానిని ఆవిష్కరించేందుకు పెద్ద ముందడుగు పడబోతోంది. ఇక ఒక్కసారి పని మొదలైందంటే ఆగేదే లేదు. ఎక్కడా తగ్గేదే లేదు. 2028 దాకా నాన్ స్టాప్, అన్‌స్టాపబుల్ అంతే.నిజానికి అమరావతి కాల పరీక్షకు తట్టుకుని నిలబడింది. గతంలో చేపట్టిన నిర్మాణాలు స్ట్రాంగ్ గానే ఉన్నాయని టెక్నికల్ కమిటీలు తేల్చాయి. అందుకే వాటి పనుల్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందుంది. అటు చంద్రబాబు సర్కార్ కూడా ఈసారి గట్టి సంకల్పమే తీసుకుంది. అటు చూస్తే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా పూర్తిగా ఉండడంతో కచ్చితంగా రాజధానిని నిర్మించి నిలబెట్టి జనం ముందు ఉంచేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేసింది. అమరావతి అంటే తిరుగులేనిది. ఈ పేరుకు ఓ బ్రాండ్ ఉంది. స్టామినా ఉంది. అంతకు మించి హిస్టరీ ఉంది. ఎవరు వచ్చినా.. ఇంకెవరు పాలించినా.. రాజధానిగా అమరావతి చెరిగిపోని ముద్ర వేయబోతోంది. చరిత్ర సృష్టించబోతోంది. ఎన్ని కాలాలైనా సగర్వంగా చెప్పుకునేలా ఉండబోతోంది.రాజధాని ఈ ప్రాంతంలోనే ఏర్పాటవుతుందని చెప్పడమే తరువాయి. 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగం వృధాగా పోలేదు. వారి పోరాటాలు వృధా అవలేదు. రాజధాని నిర్మాణం కోసం 64 వేల కోట్లు అవసరమవుతున్నాయ్. ఈ నిధులతో ఒక అడగు ముందుకు పడితే మిగితా పనులన్నీ వెంట వెంటనే జరగడం ఖాయమే. ఇది సస్టైనబుల్ ప్రాజెక్ట్. రాజధాని అన్నది అవకాశాలను సృష్టిస్తుంది. ఉపాధిని పెంచుతుంది. సౌకర్యాలు తీసుకొస్తుంది. సంపదను సృష్టిస్తుంది. అంటే పెట్టిన ఖర్చు తీరడమే కాదు.. అంతకు మించి ఎవరూ ఊహించని ప్రయోజనాలను రాజధాని అందించబోతోంది.పీపుల్స్ క్యాపిటల్ అని రాజధాని అమరావతికి క్యాప్షన్ ఇచ్చారు. అంటే అందరినీ అక్కున చేర్చుకునేలా ఉపాధి అవకాశాలు పెంచేలా, ప్రపంచంలోనే టాప్-5 నగరాల్లో ఒకటిగా ఉండేలా డిజైన్ చేశారు. మోస్ట్ అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో పాటు మెరుగైన మౌలిక వసతులు రాబోతున్నాయి. నెక్ట్ జెనరేషన్ క్యాపిటల్ సిటీ ఎలా ఉంటుందో అమరావతి పూర్తయ్యాక చూస్తే తెలుస్తుంది. నిజానికి రాజధాని నిర్మాణం ఎవరికీ రాని, చాలా అరుదైన అవకాశం. దీన్ని సీఎం చంద్రబాబు సంపూర్ణంగా పూర్తి చేసేలా బాధ్యత భుజానికెత్తుకున్నారు. కలల రాజధానిని



సాకారం చేసి చూపిస్తామన్నారు.అమరావతిలో 40 వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజధానిలో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పూర్తికాగానే రాజధానిలో పనులు ప్రారంభం అయ్యే ఛాన్స్ ఉంది. 73 పనులకు సీఆర్‌డీఏ నుంచి అనుమతి వచ్చింది. 63 పనులకు టెండర్లు పూర్తి చేశారు. వాటి విలువ 39,678 కోట్లుగా ఉంది. అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం మొత్తంగా 64 వేల 721 కోట్లు అవసరం కానున్నాయి. వివిధ రకాల ఆదాయ మార్గాల ద్వారా అమరావతి పనులు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రెడీ చేసి పెట్టుకుంది.అమరావతికి వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు కలిపి 13 వేల 400 కోట్ల రూపాయల రుణం ఇస్తుండగా, ఐఈచి బ్యాంక్ 5 వేల కోట్ల రూపాయల రుణం ఇస్తోంది. అటు హడ్కో 11 వేల కోట్లు అప్పుగా ఇవ్వబోతోంది. అయితే ఈ అప్పులను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకురాబోమని కేంద్రం తాజాగా పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితిలో లెక్కించకూడదని నిర్ణయించినట్లు పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు.2014-19లో 131 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రతిష్ఠాత్మక సంస్థలకు 1,277 ఎకరాలు ఇచ్చారు. అయితే గత ఐదేళ్లు రాజధాని నిర్మాణం జరగకపోవడంతో ఆ సంస్థల్లో కొన్ని వెనక్కు వెళ్లాయి. భవనాలు నిర్మించుకునేందుకు ఇంట్రెస్ట్ చూపలేకపోయాయి. ఇందులో ఆర్బీఐ, బిట్స్ పిలానీ సహా కీలక సంస్థలెన్నో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ కదలిక వస్తోంది. తాజాగా 31 సంస్థలకు 629 ఎకరాలు భూమి ఇచ్చారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో 50 వేల మందికి ఒక సెంటు భూమి అమరావతిలో ఇచ్చింది. అయితే వారికి వేరేచోట భూమి కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం అంటోంది.కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లో సమస్యలు పరిష్కరించి టెండర్లు ఆహ్వానించిన పరిస్థితి ఉంది. దీన్ని ప్రయారిటీగా తీసుకోవడంతోనే ఇదంతా జరుగుతోంది. ఈనెల 17న జరిగే కేబినెట్‌లో వీటన్నింటికీ ఆమోదం పొంది వెంటనే పనులు ప్రారంభించబోతున్నారు. ఏప్రిల్ నెల నుంచి అమరావతి అభివృద్ధి పనుల్లో 20 వేల మంది పాల్గొనబోతున్నారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బిడ్జ్ సహా ఇంకెన్నో రాబోతున్నాయి. ఈ పనులన్నిటికీ ప్రధాని మోడీ రీలాంఛ్ చేయడం ద్వారా నాన్ స్టాప్ గా జరగబోతున్నాయి. అటు రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో రైతులకు అప్పగిస్తారు.

## స్కామ్‌లపై చర్చిద్దామంటే పారిపోయిన టీడీపీ

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అలాగే ఈ రోజు స్కామ్‌లపై చర్చ అంటూ మండలిలో అధికారపక్షం హంగామా చేసింది. రాష్ట్ర విభజన తరువాత నుంచి ఇప్పటి వరకు అంటే 2014%-%24 వరకు జరిగిన స్కామ్‌లపై చర్చించాలని వైయస్ఆర్‌సీపీగా ప్రభుత్వాన్ని కోరాం. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం వైయస్ఆర్‌సీపీ పాలన అంటే 2019%-%24 వరకు మాత్రమే చర్చకు సిద్దమని ప్రకటించింది. అసలు గత అయిదేళ్ళ పాలనలో జరిగిన వాటిపైన కూటమి ప్రభుత్వం ఈ పదినెలల్లో పలు ఆరోపణలు మాత్రమే చేసింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు కూడా పూర్తి కాలేదు, నిరూపణ జరగలేదు. అటువంటప్పుడు వైయస్ఆర్‌సీపీ పాలనలో స్కామ్‌లు అంటూ మీరు చేసిన తప్పుడు ఆరోపణలపైన సభలో ఎలా చర్చిస్తారని అధికారపక్షాన్ని నిలదీశాం. 2014%-%19 మధ్య తెలుగుదేశం పాలనలో పలు కుంభకోణాలు జరిగాయి. వాటిపై కేసులు కూడా నమోదయ్యాయి. దర్యాప్తు కూడా పూర్తయ్యింది. వాటిపై మాత్రం చర్చకు వచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించడం లేదు. ఇది కూటమి ప్రభుత్వ ద్వందవైఖరి కాదా? స్కామ్‌లపై చర్చకు వైయస్ఆర్‌సీపీ సిద్దంగా ఉంది. ప్రజలకు వాస్తవాలను వెల్లడించేందుకు సుముఖంగా ఉంది. కానీ దురుద్దేశపూర్వకంగా చర్చను గత ప్రభుత్వ కాలానికే పరిమితం చేయాలని చూడటం దుర్మార్గం. దీనికి నిరనసగా మండలి నుంచి వాకౌట్ చేశాం అని అన్నారు.

## భూ వివాదాలకు అప్పిలేట్ అథారిటీగా ఆర్డీవో

-మొదటిపేజీ తరువాయి

3 నెలల కాలంలోనే అప్పీళ్లను పరిష్కరించనున్నారు. భౌగోళికంగా కూడా ప్రజలకు దగ్గరగా ఉండనున్న ఆర్డీవోలు డీఆర్వోల కన్నా ఆర్డీవోల వద్దకు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రానున్నాయని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

## రాష్ట్రపతి భవన్‌లో ఎంపీలకు విందు

-మొదటిపేజీ తరువాయి

పలువురు కేంద్ర మంత్రులతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల పార్లమెంటు సభ్యులతో కలసి రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు రాష్ట్రపతి గారిని కలుసుకుని పలు అంశాలు గురించి తెలియజేసారు.ఇటువంటి కార్యక్రమాలు సాంఘిక సమగ్రతను పెంపొందించడంలో మరియు పార్లమెంటరీ వ్యవస్థతో సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర వహిస్తుంది అని పేర్కొన్నారు. కార్యక్రమం లో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జగత్ ప్రకాష్ నడ్డా, కింజరపు రామ్మోహన్ నాయుడు, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే తమ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి



రూ.6 వేల కోట్లతో ఈ పథకం చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతోందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు సాయంగా ఉంటుందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 10 నెలల్లోనే 57,924 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని వివరించారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఇన్నీ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం దేశంలోనే లేదని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డల ఆత్మగౌరవం నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు త్వరలోనే 1.20 కోట్ల చీరలు పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

అసెంబ్లీ ఆవరణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 54 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. మొదటి ఏడాదిలో ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పథకాలతో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు త్వరలో నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని అన్నారు.

స్వాతంత్ర్యం తర్వాత ఇప్పటి వరకు కులగణన జరగలేదని తెలిపారు. సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మూడున్నర దశాబ్దాలుగా ఉద్యమం జరుగుతోందని తెలిపారు. తాము అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడిందని అన్నారు.

ఇక, ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ. 3 కోట్లు పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు.

రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకే.. పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 29,550 పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.5,500 కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అదే విధంగా రైతులకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశామని.. బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు సైతం పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణపైనా అసెంబ్లీలో బిల్లు పెట్టామన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారా చేసిందన్నారు.

కానీ తాము దుబారా ఖర్చులు తగ్గిస్తూ.. అప్పులు చెల్లిస్తున్నామని చెప్పారు. నిత్యవసర ధరల నియంత్రణలో దేశంలోనే ముందున్నామని చెప్పారు. జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే తెలంగాణ ముందుందని గుర్తు చేశారు. ఇక ఇసుక విక్రయంలోనే రోజు వారీ ఆదాయం రూ. 3 కోట్లు పెరిగిందన్నారు. అబద్దాల పునాదులపై తాము ప్రభుత్వాన్ని నడపట్లేదన్నారు. దేశంలోనే ఇప్పటి వరకు ఎక్కడా కులగణన జరగలేదని గుర్తు చేశారు. దేశమంతా కుల గణన జరగాల్సిన అవసరం ఉందని.. దాని ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఒకప్పుడు నోటిఫికేషన్ల కోసం రాష్ట్రంలో ధర్నాలు జరిగేవన్నారు. గత పదేళ్లలో ఒక్క గ్రూప్-1 పరీక్ష సైతం నిర్వహించలేదని గుర్తు చేశారు. ఇక రూ.6 వేల కోట్లతో ఇలాంటి పథకాన్ని ఎవరూ ప్రారంభించలేదన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 5 వేల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో ఫలితాలు పారదర్శకంగా ఉన్నాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం తెర మీదకు తీసుకు వచ్చింది. దాదాపు 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల వరకు రాయితీతో రుణాలు అందిస్తుంది. ఒక్కో లబ్దిదారుడికి రూ. 4 లక్షల వరకు మంజూరు చేస్తారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో రుణాలు అందజేయనుంది. ఈ పథకంలో దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు ఏప్రిల్ 5వ తేదీ. ఏప్రిల్ 6 నుంచి మే 31 వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. జూన్ 2 వ తేదీన రాయితీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది.

# రాష్ట్రపతి అల్పాహార విందుకు హాజరైన ఎంపి కేశినేని శివనాథ్




**అంకుశం ప్రతినిధి అమరావతి మార్చి 17: ఢిల్లీ** : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి భవన్ లో ఇచ్చిన అల్పాహార విందు కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ , స్పీకర్ ఓం బిర్లా, బి.జె.పి జాతీయ అధ్యక్షుడు ఎంపి జెపి నడ్డా, కేంద్రమంత్రులు, సహచర ఎంపిలతో కలిసి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అల్పాహార విందుకు ఆంధ్రప్రదేశ్ , కేరళ, కర్ణాటక, హార్యానా రాష్ట్రాలకు చెందిన ఎంపిలను ఆహ్వానించారు. ఈ విందులో పాల్గొన్న ఎంపిలందర్నీ కలిసి వారి పార్లమెంట్ నియోజకవర్గ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ అల్పాహార విందుకు ఆహ్వానించినందుకు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ విందులో బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి వైసిపి పార్లమెంటు పక్ష నాయకుడు మిథున్ రెడ్డి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఇతర రాష్ట్రాల ఎంపీలు పాల్గొన్నారు

# భూసేకరణ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

: జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,




**అంకుశం న్యూస్అనంతపురం, మార్చి 17 :** అనంతపురం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లోవివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ రహదారులు, ఏపీ ట్రాన్స్కో, జెన్కో, రైల్వే, పవర్ గ్రిడ్, తదితర ప్రాజెక్టులకు భూసేకరణపై ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.హెచ్ 544డి, ఎన్.హెచ్ 67, ఏపీ ట్రాన్స్కో, ఏపీ జెన్కో, రైల్వే, పవర్ గ్రిడ్, ఏపీఐఐసీ, హెచ్ఎన్ఎస్ఎస్, తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, భూమి అప్పగింత పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణలో నెలకొన్న చిన్నపాటి, ముఖ్యమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక దృష్టి సారించి జాతీయ రహదారుల పనులు చేపట్టాలన్నారు.

– ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ లు హరికుమార్, మోహన్ కుమార్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియజుద్దీన్, ఎన్.హెచ్ పిడి తరుణ్ కుమార్, ఆయా శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి.

సీసీ కెమెరాల ఏర్పాటు తోనే నేరాల నియంత్రణ సాధ్యం..

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక చేయుతనివ్వండి..

డిఎస్పి రవిబాబు,సీఐ జయా నాయక్




**అంకుశం న్యూస్ రాయదుర్గం మార్చి 17:** నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు కై ఆల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక చేయూత అందించాలని కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు, అర్బన్ సీఐ జయా నాయక్ పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఆల్ మర్చంట్ యూనియన్స్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నేరాలు, ఘోరాలు నియంత్రణ లో భాగంగా పట్టణంలో అనేక కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చోరీలకు, ఘోరాలకు పాల్పడిన వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకొని నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల నిఘాతో స్వస్తి చెప్పవచ్చన్నారు.గతం లో సీసీ కెమెరాల నిఘతోనే అఘాంతకులను అదుపులోకి తీసుకుని బాధితులకు న్యాయం జరిగిందన్నారు. పట్టణలోని అల్మార్చెంట్ సీనియర్ సభ్యులు స్పందిస్తూ గతంలో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక చేయూత అందించి పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.కాల క్రమేణా అవి ఫంక్షన్ లో లేక నిరుపయోగంలో ఉన్నట్లు గుర్తు చేశారు. పట్టణంలో ఉద్యోగుల, మేధావులతో చర్చించి అందరూ చేయూత అందించేలా సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. నేరాల, ఘోరాల నియంత్రణలో ప్రధాన పాత్ర వహిస్తున్న పాత్రికేయులు పోలీసులు అనుసంధానంతో ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తున్నట్లు పాత్రికేయుడు మనోహర్ అవగాహన కల్పించారు.ఆల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు అందరూ సీసీ కెమెరాల నిఘా పై ప్రతి ఒక్కరూ సాధ్యమైన త్వందరగా ఆర్థిక చేయూతను అందించి నిఘా నేత్రాల ఏర్పాటుకు సహకరించాలన్నారు.

## అలిపిరి పాదాల మండపం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శాస్త్రోక్తంగా అష్ట బంధన మహా సంప్రోక్షణ



**అంకుశం న్యూస్ తిరుపతి మార్చి 17:** తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద గల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ గోదా అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6 నుండి 7.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 7:30 నుండి 8:30 గంటల వరకు కుంభ ప్రదక్షిణ, ఉదయం 9.45 నుండి 10.25 గంటల మధ్య వృషభ లగ్నంలో కళావాహనము అక్షతారోహణం మహా సంప్రోక్షణ నిర్వహించారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం మార్చి 1 నుండి 3వ తేదీ వరకు "బాలాలయం" సంప్రోక్షణ నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఆలయంలోని ముఖ మండపంలో నమూనా ఆలయం ఏర్పాటు చేసి గర్భాలయంలోని మూలవర్ల



చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి శాంతి, రుత్వికులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ లను సద్వినియోగం చేసుకోవాలి



– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం న్యూస్ అనంతపురం, మార్చి 17 :** సిఎస్ఆర్ యాక్టివిటీల కింద కెనరా బ్యాంకు అందజేసిన కంప్యూటర్ లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,సూచించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో సిఎస్ఆర్ యాక్టివిటీల కింద కెనరా బ్యాంకు వారు అనంతపురం డిఆర్డీఏ కార్యాలయానికి 3 కంప్యూటర్ సిస్టంలను, 1 ప్రింటర్ అందజేయగా, వాటిని జిల్లా కలెక్టర్ చేతులమీదుగా డిఆర్డీఏ పిడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎల్డిఎం నర్సింగరావు, డిఆర్డీఏ పిడి ఈశ్వరయ్య మాట్లాడుతూ డిఆర్డీఏ కార్యాలయానికి కంప్యూటర్ లు కావాలని అడగడం జరగగా, కెనరా బ్యాంకు నుంచి సిఎస్ఆర్ యాక్టివిటీల కింద 2 లక్షల రూపాయల విలువైన 3 కంప్యూటర్ సిస్టంలను, 1 ప్రింటర్ ను డిఆర్డీఏ కార్యాలయానికి అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మిథన్థయ్య, ఏజిఎం లారెన్స్, అనంతపురం ఆర్ఓ సీనియర్ మేనేజర్ బివి.మను, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో వాలంటీర్ల వ్యవస్థ లేదని ప్రభుత్వం కీలక ప్రకటన, మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆగ్రహం

ఎన్నికల సమయంలో హామీ ఎలా ఇచ్చారన్న వైసీపీ ఎమ్మెల్సీలు



వాలంటీర్లకు 10 వేలు గౌరవ వేతనం చేస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంపై ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. 2023 ఆగస్టు నుండి రాష్ట్రంలో వలంటీర్లు వ్యవస్థ లేదని దారుణంగా మాట్లాడుతున్నారు. ఆ వ్యవస్థ లేకపోతే ఎన్నికల మేనిఫెస్టోలో వాలంటీర్ల గురించి ఎలా పెట్టారు. 2024 ఏప్రిల్ నెలలో ఎన్నికల ప్రచారం ఊరూరా తిరిగి వాలంటీర్ల జీతాలు పెంచుతామని ఎలా హామీ ఇచ్చారని ప్రభుత్వాన్ని వరుదు కళ్యాణి నిలదీశారు. జీతం పెంచగానే చించినాడా పుతారేకులు ఇవ్వండి అని మంత్రి ప్రచారం చేశారు. ఏకంగా 2.6 లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించేయడం అన్యాయం అన్నారు. వాలంటీర్లు ఉపాధి కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారికి అన్యాయం చేయకూడదని కోరారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ.. వలంటీర్లు లేకపోతే విపత్తు శాఖ ఎందుకు ఆదేశాలు ఇచ్చిందని ప్రశ్నించారు. లేని వాలంటీర్ వ్యవస్థను వరదల సమయంలో ఎలా వినియోగించారని నిలదీశారు.

## విజయ్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను ప్రారంభించిన బోండా ఉమ, దారపనేని




**కనిగిరి మార్చి 17 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం వాస్తవ్యులు డాక్టర్ చెనికల శ్రీనివాసులు సోమవారం విజయవాడలో నూతనంగా విజయ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బోండా ఉమామహేశ్వరరావు, దారపనేని చంద్రశేఖర్ డాక్టర్ చెనికల శ్రీనివాసుల ను అభినందించారు. డాక్టర్ చెనికల శ్రీనివాసులు బోండా ఉమామహేశ్వరరావు ను, దారపనేని చంద్రశేఖర్ ను దుశ్శాలవ తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ టిడిపి నాయకులు దేవరపు మాల్యాద్రి,నూతలపాటి బాల వెంగయ్య, లక్ష్మయ్య, రాము, వెంకటేశ్వర్లు,చెనికల పెదమాల కొండయ్య, చిన్న మాల కొండయ్య, వెంకటయ్య, మల్లికార్జునరావు, డబ్బుగోట్టు కృష్ణయ్య, మానం మల్లికార్జునరావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ చెనికల నాగార్జున , భాను హాస్పిటల్ జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీనివాస్, చెనికల కుటుంబ సభ్యులు, డాక్టర్లు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పిటీషన్లకు చట్టపరిధిలో న్యాయం చేయండి

జిల్లా ఎస్పీ పి.జగదీష్

జిల్లా పోలీసు " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కు 82 పిటీషన్లు



**అంకుశం క్రైమ్ ప్రతినిధి అనంతపురం మార్చి 17:** అనంతపురం జిల్లా పోలీస్ శాఖ నిర్వహించేప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ( PGRS)కు వచ్చిన పిటీషనర్లకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఈరోజు " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" ( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం ) కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ జగదీష్ జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజలతో ఎస్పీ గారు ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా జిల్లా ఎస్పీ పి జగదీష్ ఆదేశాలు జారీ చేశారుప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## రేపు 99 మండలాల్లో వడగాల్పులు



**(అంకుశం, అమరావతి, మార్చి 17):** రాష్ట్రంలోని 99 మండలాల్లో మంగళవారం వడగాల్పులు వీచనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 19 మండలాల్లో, విజయనగరం-16, పార్వతీపురం మన్యం-2, అల్లూరి సీతారామరాజు-9, విశాఖ-1, అనకాపల్లి-13, కాకినాడ-8, కోనసీమ-3, తూర్పుగోదావరి-15, ఏలూరు-4, ఎన్టీఆర్-4, గుంటూరు-2, పల్నాడు జిల్లాలోని 3 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బుధవారం 48 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

# అనంత కార్పొరేషన్అవినీతిపై విచారణ చేయిస్తా..





ప్రజా సొమ్ము తిన్న వారి నుంచి కక్కిస్తాలి

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి స్ట్రాంగ్ రియాక్షన్

డంపింగ్ యార్డ్, కుక్కల ఆపరేషన్ల అవినీతిపై వాడీ వేడి చర్చ

కార్పొరేటర్ల లేవనెత్తిన సమస్యల్ని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ

అక్టోబర్ 2నాటికి డంపింగ్ యార్డ్ లో టన్ను చెత్త కూడా ఉండదు

**అంకుశం న్యూస్ అనంతపురం మార్చి 17:** అనంతపురం జిల్లా అనంత అర్బన్ పరిధిలోనిఅనంతపురం నగరపాలక సంస్థలో జరిగిన అవినీతిపై ఖచ్చితంగా విచారణ జరుగుతుందని..ప్రజల సొమ్ము తిన్న వారి నుంచి అది కక్కిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతపురం నగర పాలక సంస్థలో జరిగిన బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలువురు కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే డంపింగ్ యార్డ్, కుక్కల ఆపరేషన్లతో పేరుతో జరిగిన అవినీతి గురించి ఎమ్మెల్యే ప్రసావించగా.. మేయర్ వసీం, పలువురు కార్పొరేటర్లు వాగ్వివాదానికి దిగారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మేయర్ అనగా.. ఎమ్మెల్యే కూడా స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు. ఈ అవినీతిపై కచ్చితంగా విచారణ జరుగుతుందని.. ఎవరెవరు ఎంత తిన్నారో.. ఎవరెవరి వాటాలు ఎంతో తేలుస్తామని..అంతే కాకుండా వారి నుంచి కక్కిస్తామని వ్యాఖ్యలు చేశారు. మరోవైపు నగరంలో రోడ్డు విస్తరణ పేరుతో విగ్రహాలు తొలగించాలని..వాటిని అలాగే తిరిగి పునఃప్రతిష్టాంచాలన్నారు. ఇంకో సందర్భంలో ఈ 9నెలలుగా ఎలాంటి పనులు జరగలేదని కొందరు కార్పొరేటర్లు చెప్పగా.. ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ దెబ్బకు కనీసం పనులు చేయాలంటే కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పాలకసంస్థలో మొత్తం 135కోట్లతో బడ్జెట్ కు ఆమోదం తెలిపినట్టు తెలిపారు. నగరంలో చాలా సమస్యల్ని కార్పొరేటర్లు తమ దృష్టికి తీసుకొచ్చారని.. కచ్చితంగా వాటిని పరిష్కరిస్తామన్నారు. గత నాలుగేళ్లుగా జరిగిన పనులన్నీ ఈ తొమ్మిది నెలల కాలంలోనే చేసినట్లు వివరించారు. రుద్రంపేట రోడ్డు, శ్రీనగర్ కాలనీలో 80ఫీట్ రోడ్డుతో పాటు చాలా పనులు చేసినట్టు వివరించారు. త్వరలోనే డంపింగ్ యార్డ్ ను పూర్తిస్థాయిలో క్లియర్ చేస్తామని.. అక్టోబర్ రెండు తర్వాత ఒక టన్ను చెత్త కూడా కనిపించకుండా చేస్తామని స్పష్టం చేశారు. మరువవంక ప్రొటెక్షన్ వాల్ 88 కోట్లతో ప్రతిపాదనలు పంపామని..దీనిని మంజూరు చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి హామీ ఇచ్చినట్టు చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేస్తామని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని.. దీనికి ఇప్పటికే డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్టు చెప్పారు. త్వరలోనే అది కూడా మంజూరవుతుందన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో 40 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు మొదలు పెట్టనున్నట్టు వివరించారు. నగరంలో అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

## ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవాలి

లక్ష మెట్రిక్ తన్నుల చెత్తను తొలగించాలి

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

**అంకుశం ప్రతినిధి నంద్యాల, మార్చి, 17:-** నంద్యాల జిల్లా నంద్యాల పట్టణం లో గల100 సంవత్సరాలు చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాలిటీలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు ముందు వివిధ అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ డంప్ యార్డులో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా అధికారులందరూ భాగస్వాములై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## మదీనా మజీద్ కమిటీ ఆర్థిక సహాయం



**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 17:** ధర్మవరం పట్టణంలోని 34 వ వార్డు రాజేందర్ నగర్ లో నివాసం ఉంటున్న మంగళ లక్ష్మీనారాయణ. అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న మదీనా మజీద్ కమిటీ , మరియు మదీనావెల్ఫేర్ కమిటీ ముతవల్లి. నాగూర్ హుస్సేన్ గారి ఆధ్వర్యంలో 10,000/- వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడంజరిగింది, ఈకార్యక్రమంలో మదీనా మజీద్ ముత్తవల్లి నాగూర్ హుస్సేన్, ఎన్.అల్తాఫ్. అయూబ్ ఖాన్, టింకర్ ఖాజ, సలీంఖాన్. అబ్దుల్ అజీజ్.ఇలాహి చాంద్ భాష. అమీర్ ఖాన్. ఈనాయతుల్లా. షేక్షావలి. ఎజాజ్ .తదితరులు పాల్గొన్నారు

# వర్మ త్యాగంపై సోషల్ మీడియాలో ఫైట్

**కాకినాడ :** జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు పిఠాపురంలో జరిగిన సమావేశం తర్వాత రాష్ట్రంలో కూటమిలోని ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరిగింది. పిఠాపురం వేదికగా చేసిన వ్యాఖ్యలు రెండుపార్టీల క్యాడర్ సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకునే పరిస్థితి ఏర్పడింది. పార్టీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య కెమెస్ట్రీ బాగానే ఉన్నప్పటికీ క్యాడర్ మాత్రం పూర్తిగా ఈ సభ తర్వాత విడిపోయినట్లే కనిపిస్తుందని సోషల్ మీడియాలో పోస్టింగ్ లు చూస్తుంటే అర్థమవుతుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఎవరి వల్ల గెలుపు అనే అంశంపై తమకు తోచినట్లు పెడుతున్న కామెంట్స్ కాక రేపుతున్నాయ్. జయకేతనం సభలో పవన్ కల్యాణ్ తో పాటు నాగబాబు చేసిన వ్యాఖ్యలు ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా హీట్ ను రెండు పార్టీలలో పుట్టించిందనే చెప్పాలి. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న తెలుగుదేశాన్ని తానే నిలబెట్టానని పవన్ కళ్యాణ్ అన్న కామెంట్లు, వర్మను ఉద్దేశించి నాగబాబు పరోక్షంగానే చేసిన కామెంట్ల పైనే ఇప్పుడు సోషల్ మీడియాలో తమ్ముళ్లు బాధపడిపోతున్నారు. తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీని ఒకరు నిలబెట్టేదేంటని ప్రశ్నిస్తున్నారు. తమకు 175 నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు, క్యాడర్ బలంగా ఉందని, జనసేన ఎన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉందో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ విషయాలు తెలియకుండా మాట్లాడితే ఊరుకోబోమంటూ ఒకరకంగా వార్నింగ్ లు ఇచ్చినట్లే వారి కామెంట్స్ కనపడుతున్నాయి జనసేన క్యాడర్ కూడా



ధీటుగానే సమాధానం ఇస్తుంది. నిజానికి జైల్లో ఉన్న చంద్రబాబును పవన్ కల్యాణ్ పరామర్శించడం దగ్గర నుంచి కూటమి ఏర్పాటు వరకూ ఆయన చేసిన కృషిని మరిచిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న టీడీపీని పవన్ కల్యాణ్ ఆదుకున్న విషయాన్ని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందేనని, ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని నిలదీస్తున్నారు. తాము కష్టపడి పనిచేయడం, తక్కువ సీట్లకే పోటీ చేయడం, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు పట్టున్నా ఓటు చీలకుండా కూటమి గెలుపునకు కారణం ఎవరనివారు సోషల్ మీడియా వేదికగా అంటున్నారు. దీంతో .. కూటమి మధ్య అగాధం ఏర్పడుతుందనే ఆందోళన ఇరు పార్టీల నేతల్లో కనిపిస్తుంది. నాగబాబు విషయాన్ని పెద్దగా సీరియస్ గా తీసుకోకపోయినా.. వర్మ చేసిన త్యాగాన్ని ఆయన కించపర్చడం ఏంటని టీడీపీ క్యాడర్ గుర్రుగా ఉంది. గతంలో వర్మ స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఎవరికి ఎన్ని ఓట్ల శాతం వచ్చాయో తెలుసుకుంటే బాగుంటుందని కూడా సూచిస్తున్నారు. కూటమి అంటే కలసి పోటీ చేయడం, కలసి పనిచేయడమేనని, అంతే తప్ప ఏ ఒక్కరి వల్లో విజయం సాధ్యం కాదని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని భావించి జనం ఓట్లేశారని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇదే సమయంలో జనసేన ను కించపరిస్తే నష్టపోయేదే మీరేనంటూ జనసైనికులు కూడా హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద జయకేతనం సభ మాత్రం రెండు పార్టీల క్యాడర్ లో గ్యాప్ మాత్రం బాగానే కనిపిస్తుంది. ఇద్దరూ సంయమనం పాటిస్తేనే మంచిదని, లేకుంటే ఇరువురికి నష్టమన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

# జగన్ తీరుపై నాయకులు అసంతృప్తి

**నెల్లూరు :** జగన్‌ను ఒకప్పుడు వైసీపీ నేతలు ఎంతో అభిమానించేవారు. జగన్ మాటకు కనీసం ఎదురు చెప్పేవారు కారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అధినేత తీరుపై నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ లబ్ధి చేకూరే విషయాల్లోనూ జగన్ నిర్లక్ష్యంగా ఉంటున్నారని.. ఇలాగైతే కష్టమే అని అంటున్నారువైసీపీ చీఫ్ జగన్ రాజకీయ వ్యూహాలు పక్కాగా ఉంటాయని.. ప్రత్యర్థులు పసిగట్టలేరని 2024 ఎన్నికలకు ముందు ఆ పార్టీ నేతలు ధీమాగా ఉండేవారు. కానీ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. ఆ నమ్మకం పోయింది. దీంతో చాలామంది నేతలు తమదారి చూసుకున్నారు. ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. అయినా జగన్ తీరులో మార్పు లేదని.. సొంత పార్టీ నేతలే చెబుతున్నారుఎల్లప్పుడూ జగన్ వెన్నంటే ఉండే నాయకులు వెళ్లిపోయినా.. జగన్ పెద్దగా పట్టించుకోలేదు. కనీసం వద్దని చెప్పినట్టు కూడా వార్తలు రాలేదు. పైగా వారిపై సోషల్ మీడియాలో దాడి పెరిగింది. దీనిపైనా వైసీపీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో ఓడిపోవడం, లీడర్లు వెళ్లిపోవడం సంగతి ఎలా ఉన్నా.. రాజకీయంగా లబ్ధి చేకూరే విషయాల్లోనూ జగన్ తీరు మారడం లేదని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.ఇటీవల అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ప్రతిపక్ష నేత హోదా కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అసెంబ్లీకి వెళ్లకుండా మీడియా ద్వారా ప్రశ్నిస్తానని జగన్ స్పష్టం చేశారు. అయితే.. ఇది సరికాదని కొందరు నేతలు జగన్‌కు చెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ప్రజల తీర్పును గౌరవించి.. అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీయాలని, గత ప్రభుత్వంపై జరిగే దాడిని ఎదుర్కొవాలని నేతలు చెప్పినట్టు సమాచారం. అయినా జగన్ పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది.గతంలో చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దాడి తీవ్రంగా ఉండేది. అయినా చంద్రబాబు సభకు వచ్చి తన బాధ్యతను నిర్వర్తించారు. హద్దులు దాటి ప్రవర్తించిన కారణంగా శపథం చేసి బయటకొచ్చారు. మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెట్టారు. చంద్రబాబును ఆ స్థాయిలో కించపరిచారు కాబట్టే.. ప్రజల్లో ఆయనపై సానుభూతి పెరిగింది. కానీ.. జగన్ ఆ అవకాశాన్ని వదులుకున్నారు' ంం

## పదోతరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ టీఎస్ చేతన్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, మార్చి 17:** శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోపకడ్బంధీగా పదోతరగతి పరీక్షలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో, పలు పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పుట్టపర్తి లోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఈరోజు పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన త్రాగునీరు, ఇతర వసతులను పరిశీలించారు. వైద్యశిబిరాన్ని సందర్శించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన మందులను అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పరీక్ష కేంద్రం నందు 78 మంది విద్యార్థులు పరీక్షలు రాయుచున్నారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంటులో ఆఫీసర్ జయ సింహా రావు, చీఫ్ ఎగ్జామ్స్ సూపర్డెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీ బస్సు కారణంగా గాయపడిన వ్యక్తులకు ఎమ్మెల్యే చేతులమీదుగా ఆర్థిక సాయం



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 17:** అనపర్తి మండలం రామవరంలో వారం రోజుల క్రితం బలభద్రపురం గ్రామ పరిధిలో GBR డిగ్రీ & పీజీ కాలేజ్ సంబంధించి కాలేజ్ బస్సు ఢీ కొనడంతో డొకుబుర్ర బన్నీ,దేనువుకొండ దుర్గాప్రసాద్ మరియు మజ్జి సోమేశ్వరి కు గాయాలయ్యాయి. వారికి అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో ఒక్కొక్కరికి రూ. 25,000/- చొప్పున రూ.75,000/- అందచేసిన GBR డిగ్రీ & పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ అబ్బాయిరెడ్డి, కాలేజ్ పాలకవర్గ సభ్యులు.

## అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సత్తి దంపతులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 17:** బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామంలో శెట్టిబలిజపేట, పెద్దగూడెం నందు శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి 32 అడుగుల ఎత్తుగల నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ మహోత్సవం లో అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మరియు శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల ప్రసాద్ రెడ్డి (బుజ్జి) (వైయస్ఆర్సీపీ మండల కన్వనర్), శెట్టిబలిజ సభ్యులు, ఆంజనేయ స్వామి మాల ధరించిన భక్తులు అనుసూరి రాంబాబు, నరాల పెద్ద భద్రం , రాయుడు నరసింహమూర్తి , కురుపూడి రాఘవేంద్ర , నరాల వెంకటరమణ, అనుసూరి శ్రీను, కేత సూరిబాబు , టేకుమూడి రమేష్, కిట్టా సురేష్ , రాయుడు సత్తిబాబు , నరాల రాంబాబు , తొండాపు కాశీ విశ్వనాథరెడ్డి, మల్లంపూడి రాంబాబు , ఇప్పర్ల సర్వా రాయుడు , చౌదరి, కర్రి నర్సిరెడ్డి, గొరిపోటి రమణ, బోకం శ్రీను , గీసాల శ్రీను , అనుసూరి సాయి , మానూరి శంకర్ , రాళ్లపల్లి నూకరాజు, కడియాల శ్రీనివాస్ , కడియాల వీర వెంకట్రావు , మామిడాల సూరిబాబు , దుంగల శ్రీను తదితరులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్సీపీ) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురైన 10వ తరగతి విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 17:** అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న 10వ తరగతి విద్యార్థి వై. నిస్సి ని పరామర్శించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో లక్ష్మీనరసాపురం గురుకుల పాఠశాలలో నిన్న పాము కాటుకు గురై అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 10వ తరగతి విద్యార్థి వై. నిస్సి ని పరామర్శించి, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. సకాలంలో ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం చేయించిన ప్రిన్సిపాల్ గారిని, మెరుగైన వైద్యం అందించిన వైద్యులను అభినందించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. వారి వెంట ఎంపీడీఓ, హాస్పిటల్ సూపరింటెండెంట్, వైద్యులు, HDR సభ్యులు,అనపర్తి టౌన్ NDA నాయకులు ,కార్యకర్తలు అధికారులు ఉన్నారు.